క్లుప్తంగా

సమస్య పరిష్కరించాలి



దీక్షా శిబిరంలో వాయనం ఇచ్చుకుంటున్న ఏఎన్ఎంలు

కొడంగల్ రూరల్: వైద్య శాఖలో ఏళ్ల తరబడి సేవలందిస్తున్న సెకండ్ ఏఎన్ఎంల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సెకండ్ ఏఎన్ఎంల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట దీక్షా శిబిరంలో నిరసనలు వ్యక్తంచేశారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన ఖాళీల భర్తీ నోటిఫికేషన్‌ను రద్దు చేసి, ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని కోరారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా దీక్షా శిబిరంలో ఏఎన్ఎంలు ఒకరికొకరు వాయనం ఇచ్చిపుచ్చుకున్నారు. అమ్మవారి దయతో ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించేలా ఆశీర్వదించాలని కోరుకున్నారు.

నేడు 'నందివాగు'లో చేప పిల్లల విడుదల

మోమిన్‌పేట: మండల పరిధి నందివాగు ప్రాజెక్టులో చేప పిల్లలను ఉచితంగా విడుదల చేయనున్నట్లు మత్స్యశాఖ అధికారి సౌజన్య శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ రానున్నట్లు ఆమె వెల్లడించారు.

కలిసుంటే అభివృద్ధి సాధ్యం



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మోమిన్‌పేట: ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఉంటే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రూ.3లక్షలతో ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యాభివృద్ధికి మైనార్టీ గురుకులాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని చెప్పారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపు

మోమిన్‌పేట: 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి తెలిపారు. ఈ నెల 26,27, సెప్టెంబర్ 2,3 తేదీల్లో గ్రామాల్లో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా ఫాం 6 నింపి నూతన ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, ఫాం 8తో సవరణలు చేసుకోవాలని సూచించారు.

కంచె ఏర్పాటు చేయండి



పాఠశాల ఎదుట ట్రాన్స్‌ఫార్మర్

పెద్దేముల్: పెద్దేముల్ మండలం అడ్కిచెర్ల గ్రామ సమీపంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఎదురుగా, రోడ్డు పక్కనే ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్న క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగి, ప్రాణనష్టం జరిగే అవకాశాలు ఉన్నాయని వాపోయారు. విద్యుత్ అధికారులు స్పందించి వెంటనే కంచెను ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్లాంటేషన్‌ను విజయవంతం చేయాలి

కొడంగల్ రూరల్: వృక్షోత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రంలో ప్రభుత్వం ఒకరోజు కోటి మొక్కల ప్లాంటేషన్ కార్యక్రమం చేపట్టిందని ఎంపీడీఓ పాండు తెలిపారు. ఇందులో భాగంగా శనివారం మండల పరిధి పోచమ్మతండా గ్రామ శివారులో ఉదయం 9గంటల నుంచి చేపట్టనున్న మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకే బీసీబంధు

మొయినాబాద్: బీసీబంధు రూ. లక్ష సాయాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇస్తున్నారని సీనియర్ నాయకుడు మందడి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. నిరుపేదలకు ఇవ్వాల్సిన ఆర్థిక సహాయాన్ని బీఆర్ఎస్ నాయకుల అనుచరులు, కార్యకర్తలకే మంజూరు చేస్తున్నారని విమర్శించారు. సంబంధిత అధికారులు స్పందించి నిజమైన లబ్ధిదారులకు పథకం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అన్నదాత కలవరం

ప్రకృతి వైపరీత్యాలతో అన్నదాతలు కలవరపడుతున్నారు. సకాలంలో వరుణుడు కరుణించకపోవడం, తీరా సాగు బాటపట్టాక కుండపోత వర్షాలు కురిసి కర్షకులకు కంటిమీద కునుకు లేకుండా పోవడం యేటా జరుగుతున్నదే. ఆ తరువాత చినుకు జాడకోసం రైతన్నలు ఆకాశం వైపు ఆశగా చూడటం, పంటలు ఎండుముఖం పట్టడం నిత్య కృత్యంగా మారింది.



ఇందూరులో పత్తి పంటకు మందు పిచికారీ చేస్తున్న రైతు (ఇన్‌సెట్లో) తెగులుతో ఆకు ముడుత పడుతున్న పత్తి

పత్తికి తెగులు.. రైతుకు దిగులు

- పూత కాత సమయంలో రోగాలు
- పెద్దేముల్‌లో 14వేల ఎకరాల్లో పత్తి పంట
- దౌల్తాబాద్‌లో తగ్గుతున్న తెల్లజొన్న సాగు
- కన్నడనాట నుంచి దిగుమతి

పెద్దేముల్: పత్తికి తెగులు బెడద పొంచి ఉంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొంత మేర నష్టం పోగా.. మిగతా కాస్త పంటనైనా కాపాడుకుందామంటే వరుణుడు ముఖం చాటేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది స్ప్రింకర్లతో సాగు చేస్తుండగా.. మరికొందరు పై వాడి మీద భారం వేసి పంటలపై ఆశలు వదులుకుంటున్నారు. యేటా ఇవే తిప్పలు తప్పడం లేదని నాగులపల్లి, ఇందూరు, అడ్కిచెర్ల, తట్టెపల్లి, పెద్దేముల్ తదితర గ్రామాల రైతులు వాపోతున్నారు.

వరుణుడు దోబూచులాట..

నెల రోజుల క్రితం కురిసిన ఏకధాటి వర్షాలు కర్షకులకు కంటిమీద కునుకు లేకుండా చేయగా.. ప్రస్తుతం వానల కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురు చూడటం గమనార్హం. కనీసం గంట పాటైనా వరుణుడు కరుణించినా.. వేసిన పంటలు ఎదిగేందుకు అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. చినుకు జాడ లేక చేతికి వచ్చిన మినుము పంట పాడవుతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విత్తనాలు నాటే సమయానికి వర్షాలు కురవకపోవటం, పంటలు ఎదిగే సమయంలోనూ భారీ వర్షాలు పడటం, పూతకాత సమయంలో వాన వాసన లేకపోవడం లాంటి ప్రకృతి వైపరీత్యాలతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. సాగు భారంగా మారిందంటూ విలపిస్తున్నారు. పెద్దేముల్ మండలంలో పత్తి 14వేల ఎకరాలు, కంది 12,500, సోయ 210, మొక్కజొన్న 190, మినుము 1,110, పెసర 970, తెల్లజొన్న 120 ఎకరాల్లో రైతులు సాగుచేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు.

అందుబాటులో లేని ఏఓలు

ప్రకృతి వైపరీత్యాలతో అల్లాడిపోతున్న తమకు కనీస వ్యవసాయ సూచనలు, సలహాలు ఇచ్చే వ్యవసాయ అధికారులు అందుబాటులో లేకుండా పోయారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. పంటలకు సోకిన రోగాలకు ఎలాంటి మందులు, ఎప్పుడు పిచికారీ చేయాలో చెప్పేవారు కూడా లేరని, ఎరువు వ్యాపారులు చెప్పిన ప్రకారం మందులు పిచికారీ చేస్తున్నట్లు పలువురు రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

తగ్గిన తెల్లజొన్న సాగు



గోకఫసల్‌వాద్‌లో జొన్నపంట

దౌల్తాబాద్: తెల్లజొన్న సాగు గణనీయంగా పడిపోయింది. సమయానుకులంగా వర్షాలు కురవకపోవడంతో నష్టం బారిన పడుతున్న రైతులు.. ప్రత్యమ్నాయ పంటల వైపు దృష్టిసారిస్తున్నారు. గతంలో దౌల్తాబాద్ మండలంలో జొన్నసాగుపై రైతులు ఆసక్తి చూపేవారు. అంతారం, దౌల్తాబాద్, మామిడికుంట, నందారం, యాంకి, ఈర్లపల్లి, తిమ్మాయిపల్లి తదితర గ్రామాల్లో జొన్న సాగు అధికంగా ఉండేది. రెండేళ్ల క్రితం సుమారు 500 ఎకరాలకు పైగానే పంటలు పండేవి. వానలు సకాలంలో పడకపోవడంతో రైతులకు పెట్టుబడి దక్కే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో వారు కొద్దికొద్దిగా జొన్న సాగుచేయడం తగ్గించారు. గతేడాది 400 ఎకరాల్లో జొన్న సాగు చేయగా, ఈసారి అది 50హెక్టార్లకు చేరింది.

కర్ణాటక నుంచి దిగుబడి

జొన్నసాగు తగ్గి ధరలు పెరగడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండల పరిధి వ్యాపారులు సమీప కర్ణాటక రాష్ట్రం నుంచి జొన్నలను దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో కర్ణాటక రైతులు లాభపడుతున్నారు. ప్రస్తుతం జొన్నలు క్వింటాలుకు రూ.3వేలకు పైగా ఉంది. పంట చేతికి వచ్చే సరికి ఈ ధర రూ.3,500 వరకు పెరగవచ్చని రైతులు చెప్పారు. జొన్నల ధరలు చుక్కలనంటడంతో రొట్టెలు తినే వారు తమ ఆహారపు అలవాట్లను మార్చుకోక తప్పడం లేదని స్పష్టం చేస్తున్నారు.

మంత్రులను సన్మానించిన ఎమ్మెల్యే కొప్పుల



మంత్రులతో ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్

పరిగి: భూగర్భగనుల శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లను ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సన్మానించారు. శుక్రవారం మంత్రులు కొడంగల్ పర్యటనకు వెళ్తుండగా పరిగిలో ఎమ్మెల్యే నివాసానికి వచ్చి మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డిని కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పరిగిలో మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని, ఈ సారి భారీ మెజారిటీతో గెలవాలని మంత్రులు సూచించినట్లు తెలిపారు.

కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకే 'విశ్వరూప'ం

మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్ మాదిగ

మోమిన్‌పేట: ఎస్సీ వర్గీకరణ బిల్లుకోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే త్వరలో హైదరాబాద్‌లో 'విశ్వరూప మహాసభ'ను నిర్వహించనున్నట్లు మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ మాదిగ అన్నారు. శుక్రవారం మోమిన్‌పేట మండలం కేసారంలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. బీజేపీ ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి పాసు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ ఆవశ్యకతను గత నెల 8న వరంగల్ జిల్లాకు వచ్చిన ప్రధాన మంత్రి మోదీని కలిసి వివరించారని ఆయన పేర్కొన్నారు. అందుకు మోదీ సమ్మతించారని చెప్పారు. అందులో భాగంగానే హైదరాబాదులో నిర్వహించే మహాసభకు మంద కృష్ణ రానున్నారని, సదస్సుకు మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు సమృద్ధి, ప్రసాద్, మధు, మోహన్, అనంతయ్య, రాములు, సాయన్న, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన యాదవ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

దోమ: యాదవ సంఘం గ్రామ అధ్యక్షుడిగా ఆంజనేయులును సంఘం స్థానిక నాయకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం దోమ మండలం బొంపల్లి గ్రామంలో యాదవ సంఘం ఎన్నికలు.. ఎన్నికల అధికారి వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ ఎన్నికలో తొమ్మిది మంది అభ్యర్థులు అధ్యక్ష పదవికి పోటీ పడగా.. కె.ఆంజనేయులును అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ముద్దం శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా బంక రవీందర్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. అనంతరం అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యత అప్పగించిన యాదవులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలతో పాటు యాదవుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ముద్దం నర్సింహులు యాదవ్, ముద్దం ప్రశాంత్ వెన్నశెట్టి నర్సింహులు, నర్సింహులు, సంద బీమయ్య, మల్లేశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ ఖ్యాతిని పెంచిన చంద్రయాన్



జాతీయ పతాకాలతో సర్పంచ్ తదితరులు

కొడంగల్ రూరల్: చంద్రయాన్ 3 ప్రయోగం ప్రపంచ దేశాల్లో దేశ ఖ్యాతిని పెంచిందని సర్పంచ్ సయ్యద్ అంజద్ అన్నారు. శుక్రవారం మండల పరిధి పర్సాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామస్తులకు జాతీయ పతాకాలను అందిస్తూ ఇస్రో శాస్త్రవేత్తల ఘనతను కొనియాడారు. మరెన్నో ప్రయోగాలతో మరింత అభివృద్ధి సాధించేదిశగా శాస్త్రవేత్తలు ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు



పోలీసుల అదుపులో నాయకులు

కుల్కచర్ల: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని విద్యావంతుల జేఏసీ జిల్లా కన్వీనర్ గాంగ్య నాయక్, లంబాడ హక్కుల పోరాట సమితీ జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్‌లు అన్నారు. విద్యావంతుల వేదిక, నిరుద్యోగ సంఘాల పిలుపు మేరకు విద్యాశాఖ కమిషనర్ కార్యాలయ ముట్టడి నేపథ్యంలో శుక్రవారం పోలీసులు మండలానికి చెందిన గిరిజన నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉద్యోగ నియామకాల విషయంలో తెలంగాణ ప్రభుత్వం అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతుందని ఆరోపించారు. వేలల్లో ఉన్న ఉద్యోగ ఖాళీలకు అనుగుణంగా డీఎస్సీ విడుదల చేయాల్సి ఉన్నా.. ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కొన్నింటిని విడుదల చేయడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యావంతుల వేదిక, జేఏసీ ఆధ్వర్యంలో తమ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. బాబ్యనాయక్, రాజేందర్ ఉన్నారు.

బాధ్యత లేకపోతే కష్టం

- సమష్టిగా పనిచేస్తేనే అభివృద్ధి
- తాండూరు ఎంపీపీ అనితగౌడ్
- సర్వసభ్య సమావేశానికి పలువురు సర్పంచులు, అధికారుల డుమ్మా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అనితగౌడ్

తాండూరు రూరల్: బాధ్యతగా ఎవరు పనిచేయకపోయినా అభివృద్ధి కుంటుపడటంతో పాటు, సమస్యలు పేరుకుపోయి ప్రజల విశ్వాసం కోల్పోతామని తాండూరు ఎంపీపీ అనితగౌడ్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా పని చేయాలని, అదిలేకపోతే కష్టమన్నారు. సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను రాసుకొని.. వాటిని పరిష్కరించేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. సమావేశానికి రాని అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను ఆమె ఆదేశించారు. అనంతరం మిషన్ భగీరథ అధికారులపై ఎంపీపీ అసహనం వ్యక్తంచేశారు.

హాజరు కాని సర్పంచులు

సర్వసభ్య సమావేశానికి బెల్కటూర్, మల్కాపూర్ సర్పంచులు మినహా మిగతా సర్పంచులు ఎవరూ హాజరుకాలేదు. గ్రామ సమస్యలు సమావేశంలో ప్రస్తావించాల్సిన వారు రాకపోవడంపై సర్వత్రా చర్చ జరిగింది. జనవరితో సర్పంచ్ పదవి ముగుస్తుండటంతో ప్రజా సమస్యలపై వారికి ఆసక్తి తగ్గినట్లు చర్చించుకోవటం గమనార్హం. ఇరిగేషన్, ఆర్టీసీకి సంబంధించిన అధికారులు రాలేదు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్, తహసీల్దార్ తారాసింగ్, ఎంపీటీసీలు నరేందర్‌రెడ్డి, కమ్లిబాయ్, శివకుమార్, సంగీత పాల్గొన్నారు.

రావడం టీ తాగి వెళ్లడం..

'పదవులు చేపట్టి ఐదు సంవత్సరాలు కావొస్తుంది. అయినా కూడా ఇప్పటి వరకు ఒక్క సమస్య పరిష్కారం కాలేదు' అని కరన్‌కోట్ ఎంపీటీసీ వసంత్ కుమార్ ఆవేదన వ్యక్తంచేశారు. కరన్‌కోట్ నుంచి ఓగిపూర్ వరకు సీసీరోడ్డు మంజూరైనా ఇప్పటి వరకు పనులు ప్రారంభించలేదని చెప్పారు. కేవలం సర్వసభ్య సమావేశానికి టైంపాస్‌కు వచ్చినట్లు ఉందని, వచ్చి టీ తాగి, బిస్కిట్ తిని వెళ్తున్నామని వాపోయారు. కాంట్రాక్టర్ విదేశాల్లో ఉన్నారని, ఆయన వచ్చిన తర్వాతే పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఏఈ నందిని తెలిపారు.

అవినీతిలో దూసుకుపోతున్న బీఆర్ఎస్

- కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి
- తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం: బళ్లారి ఎమ్మెల్సీ సతీష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సతీష్

తాండూరు టౌన్: అవినీతిలో దూసుకెళ్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని బీజేపీ బళ్లారి ఎమ్మెల్సీ సతీష్ అన్నారు. ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడారు. 9 ఏళ్లుగా తెలంగాణ ప్రజలను మోసగిస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో నామరూపాల్లేకుండా చేస్తారన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రైల్వే స్టేషన్ల అభివృద్ధి, ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, పీఎం గరీబ్ కళ్యాణ్ యోజన ద్వారా ఉచితంగా ఐదు కిలోల బియ్యం, 50 శాతం సబ్సిడీతో ట్రాక్టర్ల పంపిణీ వంటి తదితర ప్రజా సంక్షేమ పథకాలతో దూసుకుపోతుందని పేర్కొన్నారు. కానీ రాష్ట్రంలో మాత్రం బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతిలో పరుగులు తీస్తుందని ఎద్దేవా చేశారు.

అరాచకాలకు చెక్

తాండూరులో మారుతున్న రాజకీయ పరిస్థితులను, బీఆర్ఎస్ స్వార్థ రాజకీయాలను ప్రజలను గమనిస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. అభివృద్ధి పేరుతో అధికార పార్టీ నాయకుల అరాచకాలకు త్వరలోనే ప్రజలు చెక్ పెడతారన్నారు. బూత్ అధ్యక్షులు పార్టీ అందజేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. క్షేత్ర స్థాయిలో సమిష్టిగా కృషి చేసి తాండూరు గడ్డతో పాటు, తెలంగాణలో బీజేపీ జెండా ఎగురవేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీకృష్ణ గౌడ్, జిల్లా కార్యదర్శి భద్రేశ్వర్, అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్, పట్టణాధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, కౌన్సిలర్లు బాలప్ప, లలిత, శ్రీలత, నాయకులు కృష్ణ, లక్ష్మారెడ్డి, శ్రీహరి, కిరణ్, సరేందర్, రాజు ఉన్నారు.

విద్యార్థుల గోస సర్కారుకు పట్టదా?



కేజీబీవీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సంఘం నేతలు

కుల్కచర్ల: బడుగు బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు చదువుతున్న కేజీబీవీలపై ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చిన్నచూపుచూస్తున్నారని పరిగి నియోజకవర్గ పరిరక్షణ సమితి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ గౌడ్ ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాల ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 200మంది విద్యార్థులు ఉండాల్సిన విద్యాలయంలో 400మందిని ఉంచారని, వారికి తగిన సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలం అయిందని విమర్శించారు. విద్యార్థుల సౌకర్యార్థం నూతనంగా భవనం నిర్మించినా ఆ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురాకపోవడంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలపై స్పందించని పక్షంలో కేజీబీవీ ఎదుట నిరవధిక దీక్ష చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వరలక్ష్మి వ్రతం

శ్రావణమాసం రెండో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకొని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సకుటుంబ సమేతంగా మహిళలు ఉదయాన్నే ఆలయాలకు చేరుకొని లక్ష్మిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి ఒక్కరికీ సకల సౌభాగ్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించు తల్లీ అని వేడుకున్నారు. అష్టైశ్వర్యాలతో తులతూగాలని కోరుకున్నారు. అనంతరం మహిళలు ఇస్తినమ్మా వాయనం.. పుచ్చుకుంటినమ్మా వాయనం అంటూ ముత్తైదువులకు అరటిపండ్లు, తమలపాకులతో వాయనాలు ఇచ్చి పుచ్చుకున్నారు.

- సాక్షి, నెట్‌వర్క్



అనంతగిరి వైభలక్ష్మి ఆలయంలో



కొడంగల్ రూరల్‌లో..



వరలక్ష్మి వ్రతం చేస్తున్న దంపతులు



పరిగి: డీసీసీ అధ్యక్షుడు టీఆర్ఆర్ దంపతులు



మోమిన్‌పేట: ఎన్కేపల్లిలో..



తాండూరుటౌన్: ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి నివాసంలో వ్రతం చేస్తున్న ఆయన తల్లి ప్రమోదినీ రెడ్డి

విజయవంతం చేయండి

పరిగి: ఈ నెల 29న పట్టణ కేంద్రంలో నిర్వహించే మాదిగల విశ్వరూప మహాసభ సన్నాహక సదస్సును విసయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకుడు రమేష్ అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో సదస్సు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. మాదిగల విశ్వరూప మహాసభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ రానున్నట్లు తెలిపారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

పరిగి: సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పింఛన్ అమలు చేయాలని కోరుతూ టీఎస్‌సీపీఎస్ఈయూ సంఘం నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ అమలుతో ఉద్యోగులు నష్టపోతున్నారని, దాని రద్దు కోసం 2లక్షల ఉద్యోగులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటిని పరిష్కరించాలని కోరారు. దీంతో సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సీపీఎస్ ఉద్యోగుల సమ్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.